క్లుప్తంగా

వీఎస్‌యూలో ఐక్యత దినోత్సవం



వెంకటాచలం : మండలంలోకి కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చిత్రపటానికి వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ ఐక్యతా భావాన్ని పెంపొందించడంలో వల్లభ్‌భాయ్ పటేల్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన జీవితాన్ని యువతీ, యువకులు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ కె.సునీత, విద్యా ప్రభాకర్, సాయిప్రసాద్‌రెడ్డి, సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సాయం



ముత్తుకూరు : పేదలకు ఉచితంగా న్యాయ సహాయం చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. ముత్తుకూరులోని గొల్లవీధి గిరిజనకాలనీలో మంగళవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి పాల్గొని, ప్రసంగించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకే కాకుండా నిరక్షరాస్యులు, దివ్యాంగులకు ఉచితంగా న్యాయ సాయం అందిస్తున్నట్లు తెలిపారు. 1987లో ప్రభుత్వం న్యాయ సేవాధికార సంస్థ చట్టాన్ని రూపొందించిందన్నారు. కోర్టుల ద్వారా న్యాయం పొందాలంటే అధిక ఖర్చుతో పాటు జాప్యం కూడా జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు వినియోగించుకోవాలన్నారు. పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించి, చదువు చెప్పించాలని కోరారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అమ్మవారి ఉత్సవం



మనుబోలు : మండల కేంద్రంలో దసరా ముగింపు ఉత్సవాన్ని సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు నేత్రపర్వంగా సాగింది. కోదండరామపురంలోని దేవాంగుల వీధి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి అర్చకుడు శ్రీనివాసులు శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి చెంత ఉంచిన లడ్డూను వేలం వేయగా రూ.40 వేలకు పచ్చిపాల రామిరెడ్డి యూత్, అమ్మవారి మెడిలో వేసిన నగదు మాలను రూ.80 వేలకు నీలిశెట్టి సుమతి దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసి దేవతా ప్రతిమల, ఆర్చీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన డిస్కో, తీన్‌మార్ బ్యాండ్, తప్పెట్లు, మంగళవాయిద్యాలు, విచిత్ర వేషధారణలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అడుగడుగునా గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయలు, పూలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి మంగళహారతులు పట్టారు. యువకులు బాణసంచా పేలుస్తూ ఉత్సవాల వెంట కేరింతలు కొట్టారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు.

వల్లభ్‌భాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తదితరులు

నెల్లూరు(క్రైమ్): దేశ సమైక్యత, సమగ్రతను కాపాడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. వల్లభ్‌భాయి పటేల్ జయంతిని పురస్కరించుకొని రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో రన్‌ను ప్రారంభించి వల్లభ్‌భాయ్ పటేల్ నగర్ వరకు ఎస్పీ పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ అంతర్గత భద్రతకు కృషి చేస్తామంటూ పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు వీరాంజనేయరెడ్డి, కోటారెడ్డి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా పూలమాల వేసి నివాళులర్పించారు.

నెల్లూరు (టౌన్): వల్లభ్‌భాయ్ పటేల్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి పరవస్తు నాగసాయిసూరి పేర్కొన్నారు. వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవాన్ని కరెంటాఫీస్ సెంటర్‌లోని కిషోర్స్ రత్నం స్కూల్లో సమాచార ప్రసార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వల్లభ్‌భాయ్ పటేల్ జీవిత చరిత్రపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ కల్యాణి, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ



జెడ్పీ కార్యాలయంలో..

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



మందులను అందజేస్తున్న గౌరి



మాట్లాడుతున్న రంగారెడ్డి

నెల్లూరు(బారకాసు): ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. నగరంలోని 21 / 2 సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఆమె హాజరయ్యారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లు, అందిస్తున్న సేవలపై శిబిరానికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, నేతలు వెంకటరత్నం, రవి, చంద్రశేఖర్, పెంచలనర్సారెడ్డి, ప్రశాంత్, రాజారెడ్డి, బుజ్జన్న, మాల్యాద్రి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం లాంటివని పార్టీ 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిక్ పేర్కొన్నారు. కోటమిట్ట యూపీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు నవీన్, లలిత, వివేక్, బాలకృష్ణ, వైద్య సిబ్బంది తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా కలుగుతుందని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. కరెంటాఫీస్ సెంటర్‌లోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు. పార్టీ 27వ డివిజన్ ఇన్‌చార్జి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చెత్త వేయొద్దు



నెల్లూరు(బారకాసు): నగరంలోని వీధుల్లో చెత్తను వేయకుండా చూడాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా రామ్మూర్తినగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో అధికారులతో కలసి మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత పనులను చేపట్టడంతో పాటు మురుగు నిల్వ ఉండకుండా చూడాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి రీసైక్లింగ్ విధానానికి సహకరించాలని కోరారు. ఆస్తి పన్నుతో పాటు యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దాలి



నెల్లూరు (టౌన్): అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు అందరూ పాటుపడాలని ఏపీ జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీ జెన్‌కో విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని సే నో టు కరప్షన్.. కమిట్ టు ది నేషన్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ముత్తుకూరు మండలంలోని డీఏవీ స్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఏపీ ఎనర్జీ స్పెషల్ సీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెస్ రెడ్డి, ప్రిన్సిపల్ సతీష్‌చంద్ర, ఎస్సై తిరుపతిరావు, సెక్యూరిటీలు కిషోర్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలకు వినతి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(పొగతోట): ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, నాయుడు వెంకటస్వామి కోరారు. నగరంలోని ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. త్వరితగతిన స్పందించిన ఎస్పీ, కావలి సీఐ తదితరులకు కృతజ్ఞతలను తెలియజేశారు. పరారీలో ఉన్న వారిని సైతం త్వరగా అరెస్ట్ చేయాలని కోరారు. ఎన్జీఓ కోశాధికారి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, రామకృష్ణ, కరుణమ్మ, మధు, శ్రీధర్, గిరిధర్, పెంచలయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పాలస్తీనాకు సంఘీభావంగా నగరంలో ప్రదర్శనను రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి సునీత, ఏఐఎఫ్టీయూ నేత లక్ష్మీరెడ్డి, రమణయ్య, సుబ్బరాయుడు, యానాదయ్య, శరవణ్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ లీగల్ సెల్ జిల్లా సదస్సు నేడు

నెల్లూరు (లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా సదస్సును నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో బుధవారం సాయంత్రం ఆరుకు నిర్వహించనున్నామని లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

న్యాయవాది మృతికి సంతాపం



వెంకటాద్రి (ఫైల్)

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది మన్నేపల్లి వెంకటాద్రి నవాబుపేట కుమ్మరివీధిలోని తన నివాసంలో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అలరించిన దేశభక్తి గీతాల పోటీలు



జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో దేశభక్తి గీతాల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుబ్బారావు, వంశీ, బుజ్జయ్య, శ్రీనివాసులు, అంకిరెడ్డి, విశ్వేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి



ఏసీ స్టేడియంలో..



జెడ్పీ హైస్కూల్లో..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకర ఆళ్వార్‌దాస్ జయంతిని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ అధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. నలుబోలు బలరామయ్యనాయుడు, దద్దోలు రమణయ్యగౌడ్, వేలూరు రంగారావు, తిరుపతినాయుడు, రాఘవేంద్రశెట్టి, ఏకొల్లు రాఘవరెడ్డి, తలారి బాలసుధాకర్, పాబోలు సత్యం, అరిగెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్లోఆళ్వార్‌దాస్ జయంతిని జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాకర్స్ డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, రాజగోపాల్, కృష్ణయ్య, అనంతరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటసుబ్బయ్య, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం నిర్వహించారు. నవాబుపేటలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఫయాజ్, గణేష్, నాగిరెడ్డి, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించడంపై హర్షం

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించడంపై ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొద్ది నెలల వ్యవధిలోనే 140 మంది డీటీలకు తహసీల్దార్లుగా, 104 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించిందన్నారు.

ప్రియాంక గాంధీని ఆశీర్వదించండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీని ప్రజలు ఆశీర్వదించాలని ఆ పార్టీ నేత పల్లంరెడ్డి యశోధర పేర్కొన్నారు. ఈ మేరకు బృందావనంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

టీడీపీ, జనసేన సమన్వయ సమావేశం

నెల్లూరు సిటీ: టీడీపీ, జనసేన నేతల సమన్వయ కమిటీ సమావేశాన్ని నగరంలోని జీపీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న విగ్రహ ప్రతిష్ఠ

నెల్లూరు రూరల్: కాకుపల్లిలోని వర్సుసా బ్లోసమ్ సిటీలో నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాన్ని ఈ నెల మూడున నిర్వహించనున్నామని సంస్థ ఎండీ వాయుగండ్ల వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను బుధవారం నుంచి నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వేమిరెడ్డి సేవాగుణం అభినందనీయం

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవాగుణం అభినందనీయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి దాతృత్వంలో అందించిన ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే ప్రసన్న అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలువురు దివ్యాంగులు ట్రై సైకిళ్లు కావాలని విజ్ఞప్తి చేశారని, ఇందులో 100 మందికి పైగా బ్యాటరీ ట్రైసైకిళ్లను అందజేశామని తెలిపారు. మరో 25 మందికి ట్రై సైకిళ్లు కావాలని ఎంపీ వేమిరెడ్డిని కోరగా, రూ.35 వేలు విలువ చేసే బ్యాటరీ ట్రై సైకిళ్లను కొనుగోలు చేసి అందజేశారని వివరించారు. వీటికి మొత్తంగా రూ.8.75 లక్షలను వేమిరెడ్డి అందజేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుడికి సాయం అందజేత

సాక్షి ఎఫెక్ట్..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైద్యం వికటించి మంచానికే పరిమితమైన నవాబుపేటలోని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన ఖాజారసూల్‌కు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయాన్ని మంగళవారం అందజేశారు. 'వైద్యం వికటించి.. కాలం కాటేసి' అనే శీర్షికన సాక్షిలో ఇటీవల కథనం ప్రచురితమవడంతో పలువురు దాతలు స్పందిస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, తినుబండారాలను బాధితుడికి సంస్థ సభ్యులు అందజేశారు. నిర్వాహకుడు రమేష్‌రాజు, శివయ్య, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో విద్యాసంస్థల బంద్‌ను నవంబర్ 8న నిర్వహించనున్నామని పలువురు పేర్కొన్నారు. నగరంలోని ఇంటర్ ఆర్‌ఐఓ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్లను ఆర్ఎస్‌యూ, ఎస్ఎస్‌యూఐ నేతలు ఆవిష్కరించారు. నేతలు రాజా, నాగేశ్వరరావు, బాలాజీ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక నోటీసు

మా కక్షిదారుడైన **చెముడుగుంట పెంచలయ్య తండ్రి చెముడుగుంట వెంకటయ్య**, యొక్క జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ చెముడుగుంట బాబు తండ్రి పెంచలయ్య, కనుపర్తిపాడు గ్రామం, నెల్లూరు రూరల్ మండలం అనువారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా :- మా కక్షి దారుడు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై పర్మినెంటు ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ **1. సోమిశెట్టి రమేష్ బాబు తండ్రి చిన్నకాశయ్య, 2. సోమిశెట్టి బాలకాశయ్య తండ్రి చిన్నకాశయ్య**, ముంగమూరి వారివీధి నెల్లూరు సిటీ అనువారలపై **నెల్లూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.No.967/2023** అనుదావా దాఖలు చేసి, సదరు దావాలో క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిలోనికి ప్రతివాదులు వారి మనుష్యులు ప్రవేశించకుండా తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుతూ **I.A. No. 957/2023** అనుపిటీషన్ దాఖలు చేయగా, సదరు కోర్టువారు ఇంజంక్షన్ ఉత్తర్వులు ఇచ్చివున్నారు. సదరు దావా మరియు ఇంజంక్షన్ పిటీషన్ పెండింగ్‌లో వున్నవి. సదరు **రమేష్‌బాబు** మరియు **బాలకాశయ్య** గార్లు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు,అన్యాక్రాంతములు జరిపిన అవి చెల్లనేరవు. అవి మా కక్షిదారునిపై బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, బుజబుజనెల్లూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్‌లో చేరిన **కనుపర్తిపాడు ఏరియాలోని సర్వే నెం. 25-1-1** రు లోని విస్తీర్ణం **య.2-25 సెంట్లు** లేక **0.911 హెక్టార్లు** భూమికి **హద్దులు : తూర్పు:** సోమిశెట్టి బాలకాశయ్య గారి భూమి కొంత, వేనాటి సుబ్బమ్మ గారి భూమి కొంత, **దక్షిణం:** పొరుదల కాలువ, **పడమర:** గుంటకయ్య, **ఉత్తరం :** పంట కాలువ. యీ హద్దులలోని **య.2-25 సెంట్లు లేక 0.911 హెక్టార్ల** మాగాణి భూమిన్నీ.

మలిరెడ్డి శ్రీనివాసులు, B.Com., B.L.,
మలిరెడ్డి కోటారెడ్డి, B.Com., B.L., **బి.మల్లికార్జున యాదవ్**, LLM.,
అడ్వకేట్స్, శాంతి నగర్, నెల్లూరు-3. సెల్: 94402 75291.